# 3
# యోహాను బాప్తిస్మాన్ని ప్రకటించాడు

''బాప్తిస్మమిచ్చు యోహాను అరణ్యములో ఉండి పాపక్షమాపణ నిమిత్తము మారుమనస్సు విషయమైన బాప్తిస్మము ప్రకటించుచు వచ్చెను'' (మార్కు 1:4).

యోహాను చేత ప్రకటించబడి, అనుసరింపబడిన సిద్ధపరచు బాప్తిస్మం అనేది కేవలం ఒక గుడ్డి విధేయత గాని, ఒక గుర్తుగాని లేక గ్రహింపు శూన్యమైన ఆచారంగాని కాదు. దాని ఉద్దేశాన్ని, అర్థాన్ని గ్రహించినవారికే అది బాప్తిస్మంగా ఉంది.

యోహాను, ఒక గొప్ప దైవజనుడు (మత్తయి 11:11). అతడు యాజకుడైన జెకర్యా, ఎలీసబెతు అనేవారికి వారి వృద్ధాప్యంలో జన్మించాడు (లూకా 1:5-7, 57). అతడు తన బంధువైన యేసు కంటే ఆరు నెలలు పెద్దవాడు (లూకా 1:36). ప్రభువైన యేసు బాప్తిస్మం పొంది తన పరిచర్యను ప్రారంభించడానికి ఆరు నెలలకు ముందు (లూకా 3:21-23) యోహాను ముప్పది యేండ్ల వయస్సుగలవాడై యొర్దాను నది దగ్గరనున్న యూదయ అరణ్యంలో ప్రకటింప నారంభించాడు (మార్కు 1:4, 5).

యోహాను యొక్క పరిచర్య, బాప్తిస్మం యొక్క ఉద్దేశాన్ని (1) అతని పరిచర్యను గూర్చిన ప్రవచనం, (2) అతని ప్రకటన, మరియు (3) బాప్తిస్మం పొందిన ప్రజల యొక్క ప్రతిచర్య అనే వాటిని పరిశీలించడం ద్వారా కనుగొనవచ్చు.

## యోహానును గూర్చిన ప్రవచనం

ప్రభువు మార్గాన్ని సిద్ధపరచడానికి అరణ్యములో కేకవేయు ఒకని శబ్దముగా ఉంటాడని యోహానును గూర్చి యెషయా వ్రాశాడు (యెషయా 40:3; అది మత్తయి. 3:3; లూకా 3:4; యోహాను 1:23లో కోట్ చేయబడింది). ప్రభువు కొరకు మార్గాన్ని స్థిరపరచడానికి అతడు దేవుని దూతయై ఉంటాడని మలాకీ ప్రవచించాడు (మలాకీ 3:1; దీన్ని మత్తయి 11:10; లూకా 1:76; 7:27తో పోల్చి చూడు). ''నేను వచ్చి (ప్రభువు) దేశమును శపించకుండునట్లు అతడు తండ్రుల హృదయములను పిల్లల తట్టును పిల్లల హృదయములను తండ్రుల తట్టును త్రిప్పును'' అని ఈ ప్రవక్తను గూర్చి అతడు చెప్పాడు (మలాకీ 4:5, 6; దీన్ని లూకా 1:17; మత్తయి 11:14; 17:10, 11; మార్కు 9:11-13తో పోల్చి చూడు).

యోహాను జన్మించడానికి ముందుగానే గాబ్రియేలు దూత జెకర్యాకు ప్రత్యక్షమై యిలా చెప్పాడు, ''అతడు **ప్రభువు** దృష్టికి గొప్పవాడై, ద్రాక్షారసమైనను మద్యమైనను త్రాగక, తన తల్లిగర్భమున పుట్టినది మొదలుకొని పరిశుద్ధాత్మతో నిండికొనినవాడై, ఇశ్రాయేలీయులలో అనేకులను **ప్రభువైన** వారి దేవుని వైపునకు త్రిప్పును. మరియు అతడు తండ్రుల హృదయములను

పిల్లల తట్టునకును, అవిధేయులను నీతిమంతుల జ్ఞానము ననుసరించుటకును త్రిప్పి, **ప్రభువు** కొరకు ఆయత్తపడియున్న ప్రజలను సిద్ధపరచుతాడు'' (లూకా 1:16, 17; దీన్ని మలాకీ 4:6తో పోల్చి చూడు). ప్రభువైన యేసు –యోహానును రాబోయే ఏలీయాగా గుర్తించారు (మత్తయి 11:11–14; 17:11–13). యోహాను పాత నిబంధన ప్రవక్తయైన ఏలీయా కాడు (యోహాను 1:21); గాని, అతడు ఏలీయా యొక్క ఆత్మతోను, శక్తితోను వచ్చాడు (లూకా 1:17).

ప్రభువు యొక్క రాకకొరకు సిద్ధపరచుకొనడంలో ఇశ్రాయేలీయులు తమ జీవితాలను సరిదిద్దుకునేలా హెచ్చరించేదే యోహాను యొక్క పరిచర్యయని స్పష్టమౌతుంది (మలాకీ 3:1).

## యోహాను యొక్క ప్రకటన

''పరలోకరాజ్యము సమీపించియున్నది, మారుమనస్సు పొందుడి'' అనేదే యోహాను యొక్క సందేశమైయుంది (మత్తయి 3:1, 2). ''పాపక్షమాపణ నిమిత్తము మారుమనస్సు విషయమైన బాప్తిస్మము'' అనేది అతని పరిచర్యలో చేర్చబడియుంది (లూకా 3:3).

అతడు తనచేత అశ్రద్ధతో బాప్తిస్మం పొందవచ్చిన వారిని– సర్ప సంతానమా అని గద్దించాడు, మారుమనస్సు యొక్క రుజువును (ఫలితాలను) వారి జీవితాల్లో కనపర్చాలని అతడు వారిని అధికారంతో హెచ్చరించాడు (లూకా 3:7, 8). వారు ఎవరియందు విశ్వాసముంచారో ఆ రాబోయే మెస్సీయా కొరకు సిద్ధపడడంలో వారి జీవితాలను మార్చుకోవాలని అతడు తనచేత బాప్తిస్మం పొంద వచ్చిన వారికి తెలియజేశాడు (అపొ. 19:4). యేసే మెస్సీయా అని సాక్ష్యమివ్వడానికి ఆయన బాప్తిస్మమిచ్చుతూ వచ్చాడు (యోహాను 1:31–34), పరిశుద్ధాత్మ శరీరాకారంతో పావురమువలె ప్రభువైన యేసుమీదికి దిగివచ్చిన దాన్ని చూచిన తరువాత అతడు సాక్ష్యమివ్వ గలిగాడు (లూకా 3:21, 22).

యోహాను తాను ఏలీయాగాని, కనిపెట్టబడిన మెస్సీయా గాని కాదని ప్రకటించాడు (యోహాను 1:20, 21). కేవలం తనకంటే గొప్పవాడైన మెస్సీయా కొరకు మార్గాన్ని సిద్ధపరచడానికి వచ్చిన యొక దూత మాత్రమేనని అతడు తన్నుగూర్చి చెప్పుకున్నాడు. యోహానే గాని లేక ఏ యితర మనుష్యులే గాని చేయలేని దాన్ని మెస్సీయా చేయగలరు – అంటే ఆయన పరిశుద్ధాత్మతోను అగ్నితోను బాప్తిస్మమిస్తారని యోహాను చెప్పాడు (లూకా 3:16, 17).

## యోహానుచేత బాప్తిస్మం పొందినవారు

యోహాను యొక్క బాప్తిస్మాన్ని పొందడానికి వచ్చిన జనులు తమ పాపాలను ఒప్పుకునేలా వారి పాప జీవితాన్ని అర్థం చేసుకున్నారు (మార్కు 1:5). పరలోక రాజ్యం సమీపించియుందనే సందేశాన్ని వారు అంగీకరించారు, ఆ తరువాత రానైయున్న గొప్ప వ్యక్తిని గూర్చి యోహాను చెప్పిన వానియందు వారు విశ్వాసముంచారు, వారి యొక్క పాపాల నిమిత్తం మారుమనస్సు పొందారు, యోహానుచేత వాగ్దానం చేయబడిన శుద్ధీకరణను వారు కోరుకున్నారు. వారి పాపాలను ఒప్పుకోవడం ద్వారాను (మత్తయి 3:6), ఏమి చేయాలోయని వారు అడగడం ద్వారాను (లూకా 3:10–14), యోహాను యొక్క సందేశాన్ని స్థిరపరచడానికి, వారు మారుమనస్సు పొందుతూ,

వారి జీవితాలను మార్చుకోడానికి చూస్తున్నట్టు వారు తెలియజేశారు.

యోహాను సందేశంలో యిమిడియున్న దాన్నంతటిని వారు అంగీకరించారనేదాన్ని వారు బాప్తిస్మం ద్వారా ప్రదర్శించారు. అతడు కేవలం భౌతిక సంబంధమైన ప్రతిచర్యగా బాప్తిస్మం పొందాలని కోరలేదు అనడానికి ఆయన వారిమీద పెట్టిన అవశ్యాభ్యర్థనలే రుజువుగా ఉన్నాయి, అయితే మారుమనస్సు, బాప్తిస్మం అనేవి అతని సందేశానికి అర్థాన్నిచ్చే విధేయతగా గుర్తించబడ్డాయి (లూకా 3:3; అపొ. 13:24).

## యోహాను పరిచర్య

ఏమి చేయాలని యోహాను ప్రయత్నిస్తున్నాడు? జనులకు బాప్తిస్మమివ్వడమే అతని ఒకే ఉద్దేశమా? బాప్తిస్మం పొందడం ద్వారా వారు దేవునియందు విశ్వాసం కలిగియున్నారని రుజువు చేయడాన్నే అతడు కేవలం కోరాడా? వారు క్షమింపబడినట్టు వారి బాప్తిస్మం చూపుతుందా, మత సంబంధమైన గుంపుగా ప్రారంభించేలా వారిని చేసిందా, లేక దేవుని పనికొరకు తమ్మును తాము సమర్పించుకునేలా చేస్తుందా? వారి హృదయ పరిస్థితికిగాని, వారి గ్రహింపుకుగాని సంబంధం లేకుండానే బాప్తిస్మం వారి పాపాలనుండి వారిని శుద్ధికరిస్తుందా?

కర్మకాండ గుండా పోవడంకంటే యోహాను బాప్తిస్మం ఎక్కువగా కోరుతుంది. యోహాను యొక్క బాప్తిస్మాన్ని ఎవరైతే తేలికగా తీసుకున్నారో, వారు దేవుని యొక్క ఆలోచనను తేలికగా తీసుకున్నారు. అతని బాప్తిస్మాన్ని నిరాకరించి, ''యోహాను చేత బాప్తిస్మం పొందనివారు'' తమ కొరకైన దేవుని సంకల్పాన్ని నిరాకరించారు (లూకా 7:30). యోహాను బాప్తిస్మాన్ని తీసుకోవడం ద్వారా యితరులు దేవుని న్యాయవంతుడని ఒప్పుకున్నారు (లూకా 7:29). సరిగా అర్థం చేసుకొని విధేయత చూపించిన బాప్తిస్మమనేది మనుష్యుల యొక్క ఆజ్ఞకు విధేయత కాదుగాని దేవుని యొక్క ఆజ్ఞకు విధేయత చూపడమైయుంది. యోహాను యొక్క బాప్తిస్మాన్ని తృణీకరించిన వారు, మనుష్యుల ఆలోచనను కాదుగాని దేవుని ఆలోచననే తృణీకరించారు. దేవునిచే కోరబడిన పాపక్షమాపణ నిమిత్తము మారుమనస్సు విషయమైన బాప్తిస్మాన్ని పొందకుండా తప్పిపోయారు.

## యోహాను బాప్తిస్మం యొక్క ఫలితం

నిరర్థకమైన కర్మకాండ అనేది ఉద్దేశపూర్వకమైన దానికి భిన్నమైన ఫలితాన్నిస్తుంది. యోహాను యొక్క ప్రకటనకు ప్రతిచర్యగా పొందిన బాప్తిస్మం హృదయం మీద ఏ ప్రభావాన్ని కనుపర్చదు. మనుష్యుడు ఎలాటి కర్మకాండకు లోబడినా కూడ అది అతని జీవితాన్ని మార్చలేదు.

జనులను మారుమనస్సు పొందేలా చేయడానికి యోహాను ప్రయాసతో ప్రకటించాడు. వారు పొందిన బాప్తిస్మం వారికి మారుమనస్సును కలుగజేయలేదు; వారిని మారుమనస్సు పొందేలా చేసింది ప్రకటనయే (మత్తయి 12:41), వారిని బాప్తిస్మం పొందేలా చేసింది మారుమనస్సు. మారుమనస్సు పొందినవారు బాప్తిస్మానికి లోబడ్డారు, మారుమనస్సు పొందనివారు బాప్తిస్మానికి లోబడకుండానే పోయైనా ఉంటారు లేక మారుమనస్సు లేని కారణాన అతని బాప్తిస్మాన్ని నిరాకరించైనా ఉంటారు.

అతని బాప్తిస్మానికి సద్దూకయ్యులు, పరిసయ్యులు వచ్చినప్పుడు వారు మారుమనస్సు

పొందలేదు. గనుక వారికి వ్యతిరేకంగా యోహాను మాట్లాడాడు (మత్తయి 3:7-9). అతడు కోరుకున్నదంతా దేవునియందలి విధేయతతో కూడిన బాప్తిస్మమయితే, ఆయన వారిని అంగీకరించియుండేవారే, అయితే అతడు చూచేది బాప్తిస్మాన్ని మాత్రమే కాదు. పాపాలు క్షమింపబడేలా, వారి బాప్తిస్మం మారుమనస్సుతో కూడినదై ఉండాలని ఆయన ఎదురు చూశాడు (లూకా 3:3).

యోహానుచేత బాప్తిస్మం పొందుతున్నవారు మారుమనస్సు పొందారు; వారి మారుమనస్సును బట్టి, బాప్తిస్మం పొందినప్పుడు వారు క్షమింపబడతారు. అది పాపక్షమాపణ నిమిత్తము మారుమనస్సు విషయమైన బాప్తిస్మం గనుక, క్షమాపణ అనేది మారుమనస్సు మరియు బాప్తిస్మం అనే వాటిమీద ఆధారపడియుంటుంది.

అనేకమంది యోహానుయొక్క బాప్తిస్మానికి విధేయత చూపి అతనిని అనుసరించేవారయ్యారు (మత్తయ 9:14; యోహాను 1:35; 3:25; 4:1). శిష్యులను చేసుకొనడంలో ప్రభువైన యేసును మించిపోవాలనేది అతని గురికాదు గాని తన శిష్యులు ప్రభువైన యేసుకు శిష్యులుగా మార్చబడేలా వారిని సిద్ధపరచడమే (వాని ఉద్దేశం). ప్రభువైన యేసు హెచ్చవలసియుందనియు, తాను తగ్గవలసియుందనియు అతడు తన శిష్యులకు తెలియజేశాడు, అలా జరగడం అతనికి సంతోషాన్ని కలుగజేస్తుంది (యోహాను 3:25-30).

యోహాను శిష్యులనేకులు ప్రభువైన యేసును అనుసరించేవారయ్యారు. అపొస్తలుడైన అంద్రెయతో సహా (యోహాను 1:35, 40) మరియు పేతురు కూడ కావచ్చు. యోహాను బాప్తిస్మాన్ని పొందిన కొందరు అది ప్రభువైన యేసును సూచిస్తుందని తెలియజేసినప్పుడు, ప్రభువైన యేసు ప్రకటించిన బాప్తిస్మాన్ని వారు మరలపొందారు (అపొ. 19:1-5).

## ముగింపు

యోహాను బాప్తిస్మం దేవునికి సంబంధించిందేగాని, కర్మకాండకు సంబంధించిన గుడ్డి విధేయత కాదు. యోహాను యొక్క బాప్తిస్మం (1) వారి పాపాలను గుర్తించినవారికిని, (2) పాపాల నిమిత్తం మారుమనస్సు పొందిన వారికిని, (3) పాపక్షమాపణ కొరకు ఎదురు చూచినవారికిని, (4) త్వరలోనే ప్రత్యక్షం కాబోయే మెస్సీయాను గూర్చిన హెచ్చరికను అంగీకరించినవారికిని, (5) రానైయున్న మెస్సీయాయొక్క రాజ్యం కొరకు సిద్ధపడడంలో నీతిగా జీవించాలని తీర్మానం చేసుకొనిన వారికిని ఉద్దేశించబడింది. యోహాను బాప్తిస్మం కర్మకాండకుగాని లేక అర్థరహితమైన శిష్టాచారానికిగాని సంబంధించింది కాదు. యోహాను యొక్క బాప్తిస్మానికి వచ్చినవారి విధేయత హృదయపూర్వకంగా సరియైన ఉద్దేశంతో, భావంతో ప్రత్యుత్తరం యిచ్చేటట్లు దాన్ని గ్రహించినవారై ఉండాలని కోరుతుంది.